ప్రజాశక్తి
సోమవారం 29, మే 2023
5
అనంతపురం

నేటి నుంచి సబ్సిడీ విత్తనవేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల పంపిణీ ప్రారంభం కానుందని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్ తెలిపారు. ఇప్పటికే ఆర్బీకేల్లో విత్తనాలు కోసం రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని అన్నారు. శనివారం వరకు 38 వేల మంది రైతులు 33,600 క్వింటాళ్లకు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. కె-6, కదిరి-లేపాక్షి 1812 రకం వేరుశనగతో పాటు కందులు, పెసలు, కొర్రలు, రాగులకు కూడా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆదివారం వరకు 241 ఆర్బీకేల పరిధిలో 18 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ నిల్వ చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు.

అధికార దర్పం

వైసిపి ర్యాలీతో 'అనంత' బ్రిడ్జి ప్రారంభం
రెండు రోజులు తరువాతే వాహనాలకు అనుమతి
నిర్మాణ సంస్థ ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వ నిధులతో చేపట్టే ఏ అభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైన ప్రభుత్వపరంగానే చేపట్టడం ఆనవాయితీ. అయితే అనంతపురం నగరంలో మాత్రం నూతనంగా నిర్మిస్తున్న టవర్ క్లాక్ బ్రిడ్జి ప్రారంభం మాత్రం అధికారపార్టీ కార్యక్రమంతో ప్రారంభమవడం చర్చనీయాంశమవుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల కావస్తున్న సందర్భంగా వైసిపి కార్యక్రమంలాగా స్కూటర్ ర్యాలీతో ఈ బ్రిడ్జి ప్రారంభించడం చర్చనీయాంశమవుతోంది.

రెండు రోజుల తరువాత రాకపోకలకు అనుమతి

నగరంలోని బళ్లారి బైపాస్ వద్ద ఎన్‌హెచ్44 నుంచి పంగల్ రోడ్డు వరకు 9.2 కిలోమీటర్ల మేరకు రహదారి నిర్మాణాన్ని రూ.198 కోట్లతో చేపట్టారు. గతేడాది 2022 అక్టోబరులో పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 2023 అక్టోబర్ నాటికి పనులు పూర్తికావాల్సింది. అయితే నిర్మాణ సంస్థ వేగంగానే పనులు చేపట్టింది. నిర్ణీత సమయానికి కంటే ముందే పనులు ముగించే విధంగా పనులు సాగాయి. ఇందులో ప్రధానమైనది అనంతపురం నగరం నడిబొడ్డున టవర్‌క్లాక్ వద్దనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి. దీని నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ బ్రిడ్జిని ప్రారంభించాలన్న ఒత్తిడి కూడా నగరవాసుల నుంచి ఉంటోంది. ఎందుకంటే నగరం రెండు వైపులా కలిపే ప్రధానమైన బ్రిడ్జి ఇదే. అయితే ఈ బ్రిడ్జి ప్రారంభ సమయం కూడా ఆసన్నమైంది. సోమవారం ఉదయం ప్రారంభించాలని అనధికారిక ప్రకటన ఒకటి వెలువడింది. అయితే అధికారులెవరూ ఈ ప్రకటన చేయకపోవడం గమనార్హం. వైసిపి నేతలు మాత్రం నాలుగేళ్ల వైసిపి పాలన పూర్తయిన సందర్భంగా ఈ బ్రిడ్జిపై స్కూటర్ ర్యాలీ చేపట్టి అనధికారికంగా ప్రారంభించేయనుండటం గమనార్హం. ఈ కార్యక్రమంలో అధికారులెవరూ కూడా లేకపోవడం గమనార్హం. ఈ ర్యాలీ తరువాత వెంటనే ఇతర వాహనాలకు అనుమతి లేదని నిర్మాణ సంస్థ అయిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఒక ప్రకటన విడుదల చేసింది. రద్దీ ఎక్కువగా ఉండే అవకాశమున్నందున రెండు రోజుల పాటు వాహనాలకు అనుమతిలేదని, జూన్ ఒకటవ తేదీ నుంచి అనుమతి ఉంటుందని చెప్పింది. ఈ మొత్తం వ్యవహారంలో అధికారులు మాత్రం ఎటువంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. బ్రిడ్జి కింద అండర్ పాస్ నిర్మాణం కూడా పూర్తయ్యాక అధికారిక ప్రారంభముంటుందని చెబుతున్నారు.

ప్రధాన రహదారుల విస్తరణ అంతేనా ?

ఎన్‌హెచ్ 44 నుంచి పంగల్ రోడ్డు వరకు విస్తరణ చేపట్టే యోచనతో ఈ రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు బళ్లారి బైపాస్ నుంచి టవర్ క్లాక్ బ్రిడ్జి కూడా నాలుగు వరుసలతో నిర్మాణం చేపట్టారు. సప్తగిరి సర్కిల్ వరకు ఈ

ప్రారంభానికి సిద్ధం చేసిన నగరంలోని టవరక్లాక్ బ్రిడ్జి

రకంగా నిర్మాణం చేపట్టారు. సప్తగిరి సర్కిల్ నుంచి ఐరన్ ఓవర్ బ్రిడ్జి మధ్య విస్తరణకు మార్కింగు ఇచ్చారు. కాని ఇక్కడున్న నిర్మాణాలు తొలగించాలంటే పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. దీనికి సుమారు రూ.80 కోట్ల నిధులు అవసరమయ్యాయి. ఈ నిధులు రాకపోవడంతో ఉన్న రహదారుల్లో కొత్త రోడ్డు వేసి మమ అనిపించే ప్రయత్నం చేస్తున్నారు. సప్తగిరి సర్కిల్ విస్తరణ చేపడతామని అందుకు రూ.25 కోట్లు అవసరమవతాయని అధికారులు అంటున్నారు. అయితే ఆ నిధులు కూడా వస్తాయా అన్నది మాత్రం సందేహాస్పదంగానే మారింది. మొత్తం మీద అధికార వైసిపి అనధికారికంగా వంతెన ప్రారంభించనుంది.

కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

బీడీ కార్మికులను ఆదుకోవాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పనికి తగ్గ ఫలితం అందక కుటుంబ పోషణ భారమైన బీడీ కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ్య చర్యలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక సిఐటియు నాయకులతో కలిసి పట్టణంలోని వలిసాబ్ రోడ్, నిజాం వలి కాలనీల్లో పర్యటించి బీడీ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను ఆయనకు వివరించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఇందులో పని చేస్తున్నా కుటుంబానికి మూడు పూటలా తినడానికి అన్నం పెట్టలేక అప్పుల పాలవుతున్నామన్నారు. అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నామన్నారు. ఆరోగ్యాలు పాడవుతున్నా ప్రభుత్వం గానీ, బీడీ యజమానులు గాని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా కూలి అంతంత మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం బీడీ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. అనంతరం ఓబులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, ఇల్లు కట్టించాలని, చదువుతున్న పిల్లలకు ప్రత్యేక స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట నిర్వహిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐటియు నాయకులు తాజుద్దీన్, రామ్మోహన్, జిఎల్ నరసింహులు, ముస్తాక్, బాబ్‌జాన్, ఫాజిల్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై ఉక్కు పాదం....

డిఎస్‌పి కంజాక్షన్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సబ్ డివిజన్ వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాం... నేరాల అదుపుపై ప్రత్యేక దృష్టి సారించాం.. అక్రమార్కులు ఎంతటి వారైనా ఉక్కుపాదం మోపుతాం.. ప్రజలు మెచ్చుకునేలా సేవలు అందిస్తామని హిందూపురవ డిఎస్‌పి కంజాక్షన్ అన్నారు. ప్రజాశక్తితో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఎలాంటి సహకారం అందుతుంది?

జవాబు: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బాధితులు స్టేషన్‌కు వచ్చిన 15 నిమిషాల్లో ఆయా స్టేషన్లలో తమ సిబ్బంది వారితో మాట్లాడుతున్నారు. అక్కడ ఎవరూ లేకపోతే నేరుగా జిల్లా ఎస్పీకి సెల్ ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చు. ఎక్కువగా కుటుంబ సమస్యలు, ఆస్తి, భూతగాదాలతో బాధితులు స్టేషన్లకు వస్తున్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

ప్ర: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

జ: డివిజన్ వ్యాప్తంగా హిందూపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉంది. ట్రాఫిక్ సిబ్బందితో సివిల్ పోలీసులు సమన్వయం చేసుకుని సమస్య పరిష్కారానికి చొరవ చూపుతాం. అదనంగా సివిల్ సిబ్బందిని ఇందుకు కేటాయిస్తాం. జిల్లాలోనే హిందూపురం పట్టణం అతి పెద్దది కావడంతో ప్రజల రాకపోకలు అధికంగా ఉండటం, విఐపి పర్యటనల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తాం. పొరపాటున ప్రమాదం చోటుచేసుకున్నా వెంటనే సాధ్యమైనంత వరకు ప్రాణాలు కాపాడేలా ప్రయత్నం చేస్తాం.

ప్ర: అక్రమాలు అరికట్టడంపై ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: సబ్ డివిజన్ పరిధిలో అవినీతి, అక్రమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. అవినీతికి పాల్పడేవారు ఎంతటివారైనా ఉపేక్షించం. దీంతో పాటు నిషేధిత పదార్థాలు విక్రయించినా, నిషేధిత పందేలు ఆడినా చర్యలు తీవ్రంగా ఉంటాయి. అక్రమాలపై డయల్ 100కు సమాచారం అందించాలి. వెంటనే చర్యలు తీసుకుంటాం. ప్రజలు తమకు అన్ని విధాలా సహకరించాలని ప్రజలను కోరుతున్నాం.

డిఎస్‌పి కంజాక్షన్

ప్ర: ఇటీవల చోరీలు పెరుగుతున్నట్లు అనిపిస్తోంది. వీటి కట్టడి పై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: సబ్ డివిజన్ పరిధిలో చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే దీనిపై ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయి. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరా, లేదంటే ప్రత్యేక బృందం ద్వారా ప్రత్యేక నిఘా ఉంచుతాం. ఫలితంగా చోరీలు జరగకుండా ఉంటాయి. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లినా పక్కింటి వారిని గమనిస్తుండమని చెప్పడం మేలు.

ప్ర: యువత ఎక్కువగా పెడదోవపడుతున్నారు? అలాంటి వారిని కట్టడి చేయడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

జ: 18 నుంచి 25 వయస్సు మధ్యలో ఉన్న యువత మద్యానికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. పలుచోట్ల ఘర్షణలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని పలు ప్రదేశాలను గుర్తించాం. రైల్వేస్టేషన్ సమీపంతో పాటు పలు ప్రాంతాలపై నిఘా ఉంచాం. అటువైపు మద్యం సేవించడం తదితర కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం.

ప్ర: అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వాలంటే కొందరు భయపడుతున్నారు? తమ వివరాలు బయటకు చెబుతారనే అపనమ్మకంతో ఉన్నారు...

జ: అసాంఘిక శక్తులపై సమాచారం అందించడం పౌరధర్మం. వారికి ఎలాంటి అనుమానాలు అవసరం లేదు. 100కు ఫోన్ చేసి చెప్పవచ్చు. లేదంటే చిన్న లేఖ రాసినా సరిపోతుంది. అలాంటి వారు నేరుగా మా కార్యాలయానికి వచ్చి సమాచారం ఇవ్వవచ్చు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

జీవో 47 లోని అసంబద్ధాలను సరిచేయాలి : ఫ్యాప్టో

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జీవోనెంబర్ 47లోని అసంబద్ధాలను సరిచేయాలని ఫ్యాప్టో అనంతపురం జిల్లా ఛైర్మన్ ఎస్. సిరాజుద్దీన్, శ్రీ సత్య సాయి జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా ఆదివారం జిల్లాకేంద్రంలోనిసైన్స్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి డివైఈవో పద్మప్రియకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మే 17న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చలలో అన్ని రకాల ఉపాధ్యాయ పదోన్నతులు మాన్యువల్ గా జరుపేందుకు హామీ ఇచ్చారన్నారు. అయితే ఇచ్చిన హామీకి భిన్నంగా ఉపాధ్యాయుల ప్రమోషన్లు ఆన్‌లైన్‌లో జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఖాళీలు ఎక్కడ ఉన్నాయో చూపకుండా ప్రమోషన్లు వద్దనుకునే వారు రాతపూర్వకంగా అన్ విల్లింగ్ తెలపాలని ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ప్రస్తుతం పదోన్నతులు ఇచ్చే ప్రక్రియ గతంలో దానికి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు ప్రమోషన్ల కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని అన్నారు. 2022 జూలైలో ఒకసారి 2022 జనవరిలో మరొకసారి ప్రమోషన్లు ఇస్తామని ఉపాధ్యాయుల నుండి విల్లింగ్ తీసుకుని ప్రమోషన్ల వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని అది తేలిన తర్వాత ప్రమోషన్లు ఖరారు చేస్తామని నమ్మించి రూ.2500 అలవెన్స్ తో నాలుగు నెలలు పాటు పని చేయించుకున్నారని విమర్శించారు. తిరిగి మొత్తం ప్రమోషన్ కౌన్సిలింగ్ రద్దుచేసి అందరికీ నిరాశ కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా ఎలాంటి ఖాళీలు చూపకుండా విల్లింగ్ ఇచ్చిన వారికే ప్రమోషన్లు కల్పిస్తామని అధికారులు చెబుతున్నారని అది కూడా ఇంతవరకు . షెడ్యూల్‌ను కూడా ప్రకటించలేదని మండిపడ్డారు. అధికారుల ధోరణి వల్ల అనేకమంది ఉపాధ్యాయులు నష్టపోతున్నారని అన్నారు. ఏ ఖాళీలను బ్లాక్ చేయరాదని బదిలీల జీవోలోని ఉన్న అసంబద్దాలను సవరించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ జి. లింగమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రమణరెడ్డి, గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, నాయకులు బి. నరసింహులు, గోపాలరెడ్డి, సూర్యుడు, జి. వెంకటేష్,నాగేంద్ర, విశ్వనాథరెడ్డి,రత్నం, అనిల్, చంద్ర,దేశాయ్ నాగరాజు,సర్దార్‌వలి, ఎర్రిస్వామి, శివ శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రికి అనారోగ్యం

◆'పురం'లో రెండేళ్లుగా మూతబడిన ల్యాబ్ ◆మందులు లేవు...సిబ్బంది లేరు ◆కార్మికులకు భారంగా మారిన వైద్యం

శ్రీ సత్య సాయి జిల్లాలోని హిందూపురంలో ఉన్న ఇఎస్ఐ అసుపత్రికి జబ్బుచేసింది. రెండేళ్లుగా ల్యాబ్‌కు అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా చేయక పోవటంతో ల్యాబ్ మూత పడింది. 406 రకాల మందులు పంపిణీ చేయాల్సుంటే కేవలం 50 రకాల మందులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. పోనీ సరిపడా వైద్యులున్నారా అంటే అదీ లేదు. ఇక దీర్ఘకాలిక రోగుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. బిపి కోసం 8 రకాల మందులు రావాల్సి ఉంటే 2 రకాలు, షుగర్ కోసం 6 రకాల మాత్రలు రావాల్సి ఉంటే మూడు రకాలు మాత్రలు సరఫరా చేస్తున్నారు. దీంతో కార్మికులు బయట మార్కెట్‌లో మందులు కొనుగోలు చేసే స్థోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురంతో పాటు హిందూపురంలో రెండు, గుంతకల్లు, తాడిపత్రిలో ఇఎస్ఐ ఆస్పత్రులు ఉన్నాయి. ఇక్కడ రోజూ సుమారు 500లకు పైగా కార్మికులు వైద్య సేవల కోసం వస్తుంటారు. అయితే జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ఎక్కువ మంది వస్తుంటారు. హిందూపురం ప్రాంతంలో దాదాపు 20 వేల మంది కార్మికులకు పైగా ఉన్నారు. ఒక్కో కుటుంబంలో నలుగురు సభ్యులను కలుపుకుంటే మొత్తం సభ్యుల సంఖ్య సుమారు 80వేలకు చేరుకుంటుంది. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా సంస్థలు తమ ఇఎస్ఐ వాటాను ప్రభుత్వానికి ప్రతి నెల చెల్లిస్తోంది. ఇఎస్ఐ అసుపత్రిలో కార్మికుల కుటుంబ సభ్యులకు ఇఎస్ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తుంటారు. కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురానికి ఇఎస్ఐ జాయింట్ ప్రాంతీయ కార్యాలయం కడపలో ఉంది. 28 డిస్పెన్సరీలు ఆదోని, తిరుపతిలో ఆస్పత్రులు, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో డయాగ్నోస్టిక్ సెంటర్ ఉన్నాయి. వైద్యుల లెక్క ప్రకారం ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు ఒక్కో దానికి రోజుకు 100 నుంచి 150 మంది ఇఎస్ఐ కార్డు కలిగిన కార్మికులు చికిత్స కోసం వస్తుంటారు. డిస్పెన్సరీలకు అవసరమైన మందుల ఇండెంట్‌ను కడప జేడీ కార్యాలయం నుంచే విజయవాడ కార్యాలయానికి పంపిస్తుంటారు. ఏయే మందులు అవసరమో వాటిని అక్కడి నుంచి డిస్పెన్సరీలకు సరఫరా చేస్తారు. హిందూపురంలో పాటు అనంతపురం, కర్నూల్, కడప జిల్లాలకు ఆదోనిలో ఉన్నా సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా అవుతాయి. అయితే గత రెండు సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో మందులు సరఫరా కావటం లేదు.

వేధిస్తున్న మందుల కొరత

మందులు సరఫరా చేసే కంపెనీలకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవటంతో ఆయా కంపెనీలు ఇఎస్ఐ ఆస్పత్రులకు అవసరమైన మందులను సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. మూడు నెలలకు ఓసారి ఆస్పత్రులకు అవసరమైన మందుల ఇండెంట్‌ను జేడీ ద్వారా విజయవాడలోని డైరెక్టర్‌కు పంపిస్తుంటారు. 406 రకాల మందులను డాక్టర్లు ఇండెంట్ పెడుతుంటారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులతో పాటు బీపీ, షుగర్, లివర్, కిడ్నీ, గుండె సంబంధిత తదితర వ్యాధులకు సంబంధించి మందులు తెప్పిస్తుంటారు. అయితే ప్రభుత్వం కంపెనీలకు పాత బకాయిలు ఇవ్వకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయినట్లు సమాచారం. 406 రకాల మందులకు గాను ఇప్పుడు కేవలం 50 రకాలు మాత్రమే వస్తున్నాయి. కార్మికులు నిత్యం వాడే బిపి, షుగర్, థైరాయిడ్ లాంటి రోగాలకు సైతం పూర్తి స్థాయిలో మందులు రావడం లేదు.

నిరుపయోగంగా మూలన పడేసిన ల్యాబ్ పరికరాలు

మూతపడ్డ ల్యాబ్

హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ఉన్న రక్త పరీక్షల విభాగంలో టెక్నిషియన్ ఉన్నారు. అయితే ల్యాబ్‌కు అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా కాకపోవటంతో ల్యాబ్ రెండేళ్లుగా మూత పడింది. అధునాతన యంత్రాలతో దాదాపు 20 రకాల రక్త పరీక్షలను ఇక్కడ నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం హెచ్‌బి పరీక్ష మాత్రమే చేస్తున్నారు. రోగ నిర్ధారణ అయిన అనంతరమే వైద్యులు రోగులకు వైద్య సేవలను అందిస్తారు. అయితే రోగ నిర్ధారణ కోసం కార్మికులు వేలాది రూపాయలు చెల్లించి బయట ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించుకుని వస్తే తప్ప ఇక్కడ వైద్యం అందడం లేదు.

మందులే కాదు సిబ్బంది సైతం లేరు...

హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ముందులే కొరతే కాదు సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. హిందూపురం, కొట్నూరు రెండు డిస్పెన్సరీలు ఒకే చోట నిర్వహిస్తున్నారు. ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికి నర్సింగ్, ల్యాబ్ టెక్నిషియన్, ఎంఎన్ఒతో పాటు క్లాస్-4కు సంబంధించి అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు కార్యాలయంలో ఉండాల్సి సీనియర్ అసిస్టెంట్లు సైతం లేరు. దీంతో రోగులతో పాటు వైద్యులు ఇబ్బంది పడుతున్నారు.

కార్మికులకు భారంగా వైద్యం

చాలా మంది కార్మికులు అరకొర వేతనాలు, సంపాదనతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వారిలో ఎవరికైనా ఏదైనా జబ్బుచేస్తే ఇఎస్ఐ కార్డుతో చికిత్స చేయించుకోవచ్చనే భరోసా కార్మిక కుటుంబాలకు ఉంటుంది. కార్మికులతో పాటు పిల్లలు, తల్లిదండ్రులకు ఉపయోగంగా ఉండేది. అయితే ఇఎస్ఐ డిస్పెన్సరీలో కూడా మందులు కొరత ఉండడం కార్మికులను కలవరపాటుకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మందులు, ఇంజెక్షన్ల కోసం నెలకు సుమారు రూ.2 నుంచి రూ.3 వేల విలువ చేసే మందులను ఉపయోగిస్తుంటారు. వీరు క్రమం తప్పకుండా రోజూ మందులు వేసుకోవాల్సుంటుంది. అయితే ఇప్పుడు ఇఎస్ఐలో మందుల కొరత కారణంగా బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిరావడం కార్మికుల కుటుంబాలకు భారంగా మారుతోంది. ఇక్కడ సరైన వైద్యం అందక పోవడంతో ఇతర అసుపత్రుల్లో వైద్య సేవలు పొందితే దానికి సంబంధించిన బిల్లులు ఆరు నెలలు గడిచిన మంజూరు కావడం లేదు. ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ అసుపత్రుల్లోఇఎస్ఐ కార్డు ఉన్నా వారికి వైద్య సేవలు అందించమని తెగేసి చెబుతున్నట్లు కార్మికులు చెబుతున్నారు. దీనికి కారణం ఇఎస్ఐ వైద్య సేవలకు సంబంధించి సకాలంలో బిల్లులు మంజూరు కాక పోవడమేనని తెలుస్తోంది. ప్రతి నెల కార్మికులు ఇఎస్ఐ కోసం డబ్బులు చెల్లించినప్పటికి వైద్య సేవల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది.

సౌకర్యాలు మెరుగుపర్చాలి

జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక అసుపత్రి ఇఎస్ఐ అసుపత్రి. ఈ అసుపత్రిలో మందులే కాదు..సిబ్బంది సైతం లేక కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు. వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులను సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. అలాగే రక్త పరీక్షల కోసం అవసరమైన కెమికల్స్, కిట్స్‌ను సరఫరా చేసి ల్యాబ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. లేని పక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతాం.

ఇఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా కార్యదర్శి

ప్రశాంతంగా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు

కేంద్రాలను పరిశీలించిన అబ్జర్వర్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సి) ఆధ్వర్యంలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రాలను యుపిఎస్సి అబ్జర్వర్, ఎపిఐఐసి వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ప్రవీణ్ కుమార్, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తో కలిసి పరిశీలించారు. ఎస్‌కెయు, ఎస్-ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలల్లో పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులకు ఏర్పాటు చేసిన వసతులపై ఆరా తీశారు. ఆదివారం ఉదయం నిర్వహించిన 8 పరీక్షా కేంద్రాలలో 3213 మంది అభ్యర్థులకుగాను 1814 మంది హాజరయ్యారు. ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన 8 పరీక్షా కేంద్రాలలో 3213 మంది అభ్యర్థులకుగాను1788 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కుశాల్ జైన్, అనంతపురం ఎపిఐఐసి జోనల్ మేనేజర్ వరప్రసాద్, ఆర్‌డిఒ మధుసూదన్, ఆన్‌సెట్ సిఇఒ కేశవ నాయుడు, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర రెడ్డి, ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ ప్రవీణ్‌కుమార్

రుతుక్రమ సమయంలో జాగ్రత్తలు పాటించాలి

గైనకాలజిస్టు పుష్పలత

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మహిళలు రుతుక్రమ సమయంలో జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ పుష్పలత సూచించారు. రుతుక్రమ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మెప్మా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో డిప్యూటీ కమిషనర్ సావిత్రి అధ్యక్షతన మహిళా సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్టు మాట్లాడుతూ రుతుక్రమం అనేది శరీరంలో జరిగే ఒక సాధారణ ప్రక్రియ అన్నారు. ఇందుకు మహిళలు సిగ్గుపడాల్సిన అవసరంగానీ, అపరాధ భావంతోగానీ ఉండాల్సిన అవసరం లేదన్నారు. అయితే శరీరం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. దేహాన్ని శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చన్నారు. ముఖ్యంగా మహిళలు న్యాప్‌కిన్ ప్యాడ్లను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, టౌన్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు భవాని, భువనేశ్వరి, సుగుణ, పల్లవి, శిరీషా, వేణుగోపాల్, నారాయణస్వామి, సత్యమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో గైనకాలజిస్టు పుష్పలత

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

మాజీమంత్రి పరిటాల సునీత జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమానికి రుద్ర కన్‌స్ట్రక్షన్ యజమాని అనిల్‌కుమార్ ఆర్థికసాయం చేయగా సాయిట్రస్టు ఆధ్వర్యంలో దాదాపు 300 మందికి అన్నదానం చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు. అంతకుముందు ఆసుపత్రిలో చిన్నారులతో కలిసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పరిటాల సునీత సోదరుడు బాలాజీ, శీనా, సాయి ట్రస్టు సభ్యులు నారాయణ, రాఘవేంద్ర, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రంలోని కళ్యాణదుర్గం-అనంతపురం జాతీయ రహదారిపై ఎస్ఐ జనార్ధన్ ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధరించకపోవడం, సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి డ్రైవింగ్ చేసినా, అతివేగంతో వెళ్లినా, వాహనం నడుపుతూ ఫోన్‌లో మాట్లాడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జమేదార్ దేవేంద్రబాబునాయక్, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నేటి నుంచి విత్తనవేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి-గార్లదిన్నె

నేటి నుంచి మండలవ్యాప్తంగా విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఎగుపల్లి గ్రామం వద్ద ఉన్న వైఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయనున్న విత్తన వేరుశనగ పంపిణీని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, తలారి రంగయ్య ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావున విత్తనకాయల కోసం రిజిస్టర్ చేసుకున్న రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొచ్చి కాయలు తీసుకెళ్లాలని కోరారు.

గుత్తి : ప్రభుత్వం రాయితీ కింద ఇచ్చే వేరుశనగ విత్తనాలను సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ముస్తాక్‌అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వన్నెదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. ఇదివరకే రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులందరికీ అందజేస్తామన్నారు.

30, 31 తేదీల్లో సమాచార హక్కు చట్టం క్యాంప్ కోర్టు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాచార హక్కు చట్టం కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31వ తేదీల్లో కోర్టు క్యాంప్ నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ శాఖ అధికారి బి.గాయత్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఉల్చల హరిప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఫిర్యాదులు స్వీకరించి ఫిర్యాదుదారులతో చర్చించుకున్నట్లు తెలిపారు. అలాగే 30న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీతో మొదట సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం జిల్లాకు చెందిన సెకండ్ ఆపిల్స్, కంప్లైంట్ దారులతో చర్చిస్తారన్నారు. 31న కూడా సెకండ్ ఆప్పీళ్లదారులతో సమావేశం నిర్వహించి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహానాడులో నార్పల నాయకులు

ప్రజాశక్తి-నార్పల

టిడిపి ఆధ్వర్యంలో రాజమండ్రిలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడుతోపాటు పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జాఫర్‌వలి, నార్పల మండల కన్వీనర్ ఎర్రాగప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పిఎల్ లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, యూనిట్ ఇన్‌ఛార్జిలు బొగ్గ నారాయణస్వామి, కేశేపల్లి నాగేంద్ర, దుండగు నాగేష్, సీనియర్ నాయకులు రంగాపురం చౌదరి, ఆర్.రాజన్న, చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో పాల్గొన్న నార్పల టిడిపి నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

సిఎం జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో కుల,మత బేధాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో ప్రజలకు ఏదైనా పనిగానీ, పథకాలుగానీ అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే ఇచ్చేవారన్నారు. అదే వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ ఇళ్ల వద్దకే వెళ్లి ఇస్తున్నారన్నారు. ఇది చూసి టిడిపి నాయకులు ఓర్చుకోలేక పోతున్నారన్నారు. దీంతో ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు వేస్తున్నారన్నారు. కాగా జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అన్నాడు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన నవరత్నాల పథకాలన్నీ 99 శాతం అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, ఎంపిపి గంగాదేవి, జెడ్పిటిసి విజయ్ ప్రతాప్‌రెడ్డి, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ కొండన్న, సర్పంచు ఓబులమ్మ, వైసిపి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం పొందిన వాలంటీర్లతో
రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్ఐ జనార్ధన్

ప్రజాశక్తి-ఆత్మకూరు

క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసికోల్లాసం లభిస్తుందని ఎస్ఐ జనార్ధన్ సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ మ్యాచ్‌లో ఆత్మకూరు-నార్పల జట్లు తలపడగా ఆత్మకూరు జట్టు ఫస్ట్ బ్యాటింగ్ చేసి 14 ఓవర్లకు 89 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్పల జట్టు కేవలం 14 ఓవర్లకు 82 ఆలౌట్ అయింది. దీంతో విజేత ఆత్మకూరు జట్టుకు రూ.లక్ష బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రీడాకారుల్లో క్రీడల ద్వారా నైపుణ్యం పెరగడంతోపాటు మంచి స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. గెలిచినప్పుడు పొంగిపోయి, ఓడినప్పుడు కుంగిపోవడం వంటివి చేయరాదన్నారు. కాగా వెంకటరామిరెడ్డి జ్ఞాపకార్థం సద్దికూటి వారి ఫ్యామిలీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సద్దికూటి సూర్యచంద్రారెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి తరుణ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, విజయరెడ్డి, కొండారెడ్డి, నిట్టూరి సుబాన్, కరెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్ధన్

కార్యక్రమంలో మాట్లాడుతున్న అమరాన్ బ్యాటరీ సంస్థ ప్రతినిధులు

బైక్‌మెకానిక్‌లకు అవగాహన

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఆదివారం బైక్ మెకానిక్‌లకు అమరాన్ బ్యాటరీల తయారీ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరాన్ బ్యా టరీల తయారీ సంస్థ ప్రతినిధులు మోహన్, రాజేష్ మాట్లాడుతూ ఉమ్మడి చి త్తూరు జిల్లాలోని అమరాన్ బ్యాటరీల తయారీ సంస్థ ఎక్కడికీ తరలివెళ్లలేదని తిరుపతి సమీపంలోనే ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా స్థానికులకు తమ సంస్థ ద్వారా ఉపాధి ఇస్తున్నట్లు చెప్పారు. బైక్ మెకానిక్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గుత్తిలో మెకానిక్ అసోసియేషన్‌కు స్థలాన్ని కేటాయించి భవనాన్ని ప్రభుత్వం నిర్మించాలన్నారు. ఆటోనగర్ ఏర్పాటు చేసి మెకానిక్ లకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సచివాలయాల కన్వీనర్ వై.సుభా ష్‌రెడ్డి, రాయలసీమ విమోచన సమితి కన్వీనర్ వై.రాజశేఖర్‌రెడ్డి, మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జాఫర్, గౌరవ సలహాదారుడు మురళీమోహన్‌రెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, మస్తాన్, నాగేంద్ర, రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎపి ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

అనంతపురం కలెక్టరేట్ : ఎపి ఎమ్మార్పీఎస్ అనంతపురం రూరల్ మండలం కురుకుంట గ్రామం కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఛైర్మన్ బీసీఆర్ దాస్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్డీటీ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే భూమిలేని ప్రతి కుటుంబానికీ మూడెకరాల భూమి ఇవ్వాలని, దళితులపై దాడులు, దళిత మహిళలపై హత్యలు, అత్యాచారాలను నిరోధించాలని, రద్దు చేసిన 32 దళిత పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. కురుకుంట గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కుళ్లాయప్ప, అధ్యక్షులుగా బండారు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శిగా మల్లెల శంకర్, కోశాధికారిగా వెల్డింగ్ నాగరాజు నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు కార్యదర్శులను నియమించారు. ఈ కార్యక్రమంలో బిసిఆర్ దాస్, రామకృష్ణ, మల్రాయుడు, ఓబుళపతి, రాము పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు ఎన్‌టిఆర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నందమూరి తారక రామారావు శత జయంతిని పురస్కరించుకుని టిడిపి జిల్లా అధికార ప్రతినిధులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, మాజీ కార్పొరేటర్లు రంగాచారి, సీసాల సీన ఆధ్వర్యంలో ఆదివారం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యనిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వరనాయుడు, బొమ్మినేని శివ, కుంచెం వెంకటేష్, జెఎం.బాషా, సరిపూటి శ్రీకాంత్, ఎన్‌బికె నారాయణస్వామి, సిరిసాల రాంబాబు, మనోహర్, రాఘవనాయుడు, ఎస్ఎం.బాషా, జాంబవంతుడు, బోయ రాము, రవిచౌదరి, స్టోర్‌సీనా, నాగరాజునాయుడు, చెరుకుతోట పవన్, శ్రీనివాసచౌదరి, ఓబుల్‌రెడ్డి, పరంధామ, జెన్నె మురళి, మాజీ కోఆప్షన్ మెంబర్ షరీనా, దేవి, శోభ, రాజీవకాలనీ అశోక్, ముబారక్, బోయ రవి, డిష్ రామాంజి, దినేష్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో నగరంలోని సంగీత కళాభారతి భవన్‌లో చిత్రపటానికి పూలామాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నటించిన సినిమాల్లోని పాటలను సభ్యులందరూ పాడారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి అనంతపురం అధ్యక్షులు సురేష్‌బాబు, సూర్యనారాయణరెడ్డి, కేశవ, మారుతీనాయుడు, శేషాద్రి, నరసింహులు, నాగరాజు, మణిరత్నం, పెద్దన్న, తలారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అలాగే తెలుగు యువత అధికార ప్రతినిధి బంగి నాగ ఆధ్వర్యంలో లలిత కళాపరిషత్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంగి నాగ మాట్లాడుతూ తెలుగువారి ఆరాధ్య దైవం, తెలుగుజాతి ఔన్నత్యాన్ని దశదిశలా చాటిన మహానుభావుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జనసేన సంఘం అధ్యక్షుడు దాసగాని కుళ్లాయప్ప, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కెపి.నారాయణస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకుల రమేష్, నాగార్జున, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు, జిట్రా రామ్మోహన్, చిన్న ఆంజనేయులు, మల్లి, యల్లన్న, ఆర్పీఎస్ నాయకులు శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఐ ఎమ్ ఎమ్ భాష, సాదిక్ వలి, మునీర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఓబుళనాయుడు, గోపరాజుపల్లి రవికుమార్‌రెడ్డి, చెర్లోపల్లి రవి, బ్రహ్మయ్య, ఎల్‌కె.చిన్నారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటరాముడు, రామచంద్రనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా నివాళి

తాడిపత్రి : నందమూరి తారకరామారావు యుగపురుషుడు అని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి కొనియాడారు. ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడికి కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో టిడిపి స్థాపించి తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అనుబంధ సంఘాల నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి, ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, మండల కన్వీనర్ హనుమంతు, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్‌లు మహబూబ్‌బాషా, వెంకటేశులు, నాయకులు ధనార్ధన, జమీల్‌ఖాన్, తిప్పయ్య, శ్రీనివాసులు, ఆనంద్, అంజి, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల కేంద్రంలోని బస్టాండు సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు గేటు కృష్ణారెడ్డి, బాలకృష్ణ, కొర్రపాటి శ్రీనివాసులు, కల్లూరు రాము, బాబయ్య, ప్రసాదు, గుర్రం ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని టీ సర్కిల్‌లో నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నారాయణస్వామి, మల్లికార్జున, త్రివేదినాయుడు, పెద్ద తిప్పయ్య, మాజీ వైస్ ఎంపిపి తిమ్మప్ప, మాజీ ఎంపిటిసి కంచి రాముడు, ఆవులెన్న సర్పంచు రామ్మోహన్‌చౌదరి, సురేష్, బాలాజీ, అంగిడి శ్రీరాములు, బైనే నారాయణస్వామి, సిద్దన్న, మారెన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని గుత్తిలో ఆదివారం పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాల లేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కె.గోవిందు, టిడిపి నాయకులు ఎన్.కేశవనాయుడు, కుమార్, సత్యనారాయణ, ఎస్ఎం బాషా, సుధాకర్‌నాయుడు, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, తెలుగు యువత అధ్యక్షులు పరిమి చరణ్ ఆధ్వర్యంలో కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌నాయుడు, చుక్కల్లూరు రామచంద్రారెడ్డి, కులశేఖర్, ముప్పగౌని నాగరాజు, సుబ్బారెడ్డి, దడియాల ఆది, తాండ్ర విక్రమ్, కోడూరు నీల కంఠరెడ్డి, బొట్టు శేఖర్, మధురాజు, రామానాయుడు, నెట్టి కంటి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

గుత్తి, పుట్లూరు, బెలుగుప్పలో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

అండర్-16 బాస్కెట్‌బాల్ శిబిరానికి ధర్మవరం బాలిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జాతీయ స్థాయి అండర్-16 బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు ధర్మవరం పట్టణానికి చెందిన బాలిక కిరణ్మయి ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజిం గ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. కిరణ్మయిని ఆదివారం అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ అజయ్, ఆత్మీయ ట్రస్టు వైస్ ఛైర్మన్ సూర్యప్రకార్‌రెడ్డి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఇండియా జట్టుకు మే 31 నుంచి జూన్ 6 మధ్య చత్తీస్‌ఘడ్‌లో క్రీడాకారులను ఎంపిక చేస్తారన్నారు. దీనికి కోసం ప్రాబబుల్స్ టీంను ప్రకటించగా కిరణ్మయికు చోటు దక్కిందన్నారు. అనంతరం కిరణ్మయికి ఆత్మీయ ట్రస్టు తరపున రూ. 5 వేలను అందజేశారు.

ధర్మవరం మున్సిపల్ తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా భాగ్యలక్ష్మి

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపాలిటీ తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా ప్రస్తుత వైస్ ఛైర్‌పర్సన్ భాగ్యలక్ష్మిని నియమిస్తూ ఈ నెల 26వ తేదీ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. నూతన శాశ్వత ఛైర్‌పర్సన్ ఎన్నిక జరిగేంత వరకూ భాగ్యలక్ష్మి ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతారన్నారు. ఇది వరకూ ఉన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల రాజీనామా చేయగా కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదించారు.

వాహన కాలుష్యాన్ని నివారిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం

బత్తలపల్లి : కాలుష్య కోరల నుంచి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడదామని కదిరి రవాణా శాఖ ఎంవిఐ ఎంవి ప్రసాద్ వాహనదారులకు సూచించారు. బత్తలపల్లిలో ఆదివారం వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ కాలుష్యం కోరలు చాస్తోందన్నారు. పర్యావరణానికి హానికరంగా తయారవుతున్న కాలుష్యం వల్ల మనుషులకు అనేక రోగాలు వస్తున్నాయన్నారు. కాలుష్యం వల్ల చిన్న వయస్సుకే జీవితం చాలించాల్సి వస్తోందన్నారు. కాలం చెల్లిన వాహనాల తో మరింత ఎక్కువగా వాతావరణం కాలుష్యమవుతోందన్నారు. వాహనదారులు తమ వాహ నాలకు ఎప్పటికప్పుడు కాలుష్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కండీషన్‌లో లేని వాహనాలను వాడవద్దన్నారు. అనంతరం వాహనదారులతో కాలుష్య నివారణకు పాటుపడదా అని ప్రతిజ్ఞ చేయించారు.

పిడుగు పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - శింగనమల

పిడుగు పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా శింగనమల మండలంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈఘటనకు సంబందించిన వివరాలు... శింగనమల మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామానికి చెందిన వడ్డే బాలకృష్ణ తన తోటలో మొక్కజొన్న విత్తనాలను కూలీలతో ఆదివారం నాటిస్తున్నాడు. సాయంత్రం సమయంలో బాలకృష్ణ దాయాది మల్లిఖార్జున కుమారుడైన బిటెక్ చదివే గౌరీ శంకర్ అనే యువకుడు తోటలోకి వచ్చాడు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం రావటంతో కూలీలందరు ఒక చోటకు వెళ్లగా బాలకృష్ణ, గౌరీశంకర్ ఇద్దరూ ఒక చెట్టుకిందికి వెళ్లారు. ఆ సమయంలో వీరు ఉండే చోట పిడుగు పడటంతో బాలకృష్ణ (30, గౌరీశంకర్ (24) అక్కడికక్కడే మృతిచెందారు. బాలకృష్ణ బేల్దారు పని చేసుకుంటూ మరో వైపు తోటపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. పిడుగుపాటుతో కుటుంబం పెద్దదిక్కు కోల్పోవటంతో కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఇక వడ్డే మల్లికార్జున ఒకాగానొక్క కుమారుడు గౌరీ శంకర్ కర్నూలులో బిటెక్ చదువుతున్నాడు. సెలవులు రావడంతో సొంత గ్రామానికి వచ్చిన గౌరీశంకర్ ఆదివారం సాయంత్రం సరదాగా తోట వద్దకు వెళ్లి పిడుగుపాటుకు మృతిచెందాడు. చేతికొచ్చిన కొడుకు చనిపోవడంతో మృతుని కుటుంబసభ్యులు చేస్తున్న రోదనలు కంటతడిపెట్టించాయి. పిడుగుపాటులో గ్రామానికి చెందిన ఇద్దరు మృతిచెందడంతో ఉల్లికల్లు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతిచెందిన గౌరీశంకర్, బాలకృష్ణ